ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి
- సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు
- 17వ రోజుకు చేరిన దీక్ష

జనగామ, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : గత ఏడాది సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా హనుమకొండలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు తాడూరు రమేశ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె గురువారం 17వ రోజుకు చేరింది. వారికి మద్దతుగా సీపీఎం నాయకుడు కనకారెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో సేవ చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. వారికి రెగ్యులర్ చేయాలని కోరారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నందున అణగారిన విద్యార్థులకు విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా కళ్లు తెరిచి సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, బూడిద గోపి, జోగు ప్రకాశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధర్మాభిక్షనాయక్, సమగ్ర శిక్షా ఉద్యోగులు దయాకర్ గౌడ్, అబ్బ సాయిలు, సమ్మయ్య, శ్రవణ్ కుమార్, కరుణాకర్, రమేశ్, నరేశ్, ఇందిర, శ్రీవాణి, అన్నపూర్ణ, సునీత, గోరంట్ల యాదగిరి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

లింగాలఘనపురం; డిసెంబర్ 26 : మండల తహసీల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీబుమారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. మండలకేంద్రంలోని తన చాంబర్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా 87 మందికి చెక్కులను అందించనున్నట్లు వివరించారు.

గుడుంబా పట్టివేత

తరిగొప్పుల, డిసెంబర్ 26 : మండలంలోని బొత్తలపర్రెలో తనిఖీలు చేస్తుండగా గుడుంబాను తయారు చేస్తున్న భుక్యా సన్నీని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ అక్రమంగా గుడుంబా తయారు చేస్తుండగా దాడి చేసి, నాలుగు లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆమె వెల్లడించారు.

యువతి అదృశ్యం

అఖిల(ఫైల్)

జఫర్‌ఘడ్, డిసెంబర్ 26 : మండలంలోని లక్ష్మీనాయక్ తండాకు చెందిన భుక్యా అఖిల(19) ఈ నెల 23 నుంచి కనిపించడం లేదని ఏఎస్సై వెంకట్‌నారాయణ తెలిపారు. తండాకు చెందిన యాకూబ్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. యాకూబ్, అతడి భార్య బంధువులు చనిపోగా వెళ్లాడు. వారు వెళ్లిన గంటకే అఖిల కూడా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. విషయం ఫోన్ ద్వారా తెలుసుకున్న యాకూబ్ దంపతులు వచ్చి కుమార్తె కోసం ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చాడ సునీతకు సీపీఎం మద్దతు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మాజీ వీవోఏ చాడ సునీతకు సీపీ ఎం మద్దతుగా ఉంటుందని పార్టీ జనగామ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు పట్టించుకోకుండా జనగామ గత కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆయన ద్వారా తాటికొండకు చెందిన చాడా సునీత గ్రామంలో అవమానానికి గురైందని, తనకు న్యాయం జరగాలంటూ జనగామ కోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. కోర్టు రెఫర్ ద్వారా స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో శివలింగయ్యపై ఎఫ్ఆర్ఐ నమోదు చేయించిన చాడ సునీత, ఆమె భర్త ఏలియా దంపతులకు న్యాయం జరిగే వరకూ మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్రక్టిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాదించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నవీన్(ఫైల్)

దేవరుప్పుల, డిసెంబర్ 26 : తండ్రి మందలించాడని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మాధాపురం గ్రామానికి చెందిన చిలుకాని శ్రీను కుమారుడు నవీన్(23) మూత్ర విసర్జన సమస్యతో బాధపడుతుండగా ఇటీవల ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ అనంతరం ఇంటికి వచ్చిన కుమారుడు నవీన్‌ను ఇన్నాళ్లూ ఈ సమస్యను ఎందుకు చెప్పలేదని తండ్రి శ్రీను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ ఈ నెల 24న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు చిలుకాని శ్రీను కుమారుడు నవీన్ మృతితో మండలంలోని పార్టీ నాయకులు ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి నేతృత్వంలో నవీన్ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శీల తిరుమలేశ్, తాటిపల్లి మహేశ్, మడికొండ ఎల్లయ్య, మాదాపురం మాజీ ఎంపీటీసీ బానోతు యాకూనాయక్, మాజీ సర్పంచ్ గుర్రం స్రవంతి, క్రాంతికుమార్, భూక్యా శ్రీను, నాగరాజు, గుర్రం యాకస్వామి, బెజగం ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడికి నివాళి

తాతాచార్యులు(ఫైల్)

లింగాలఘనపురం; డిసెంబర్ 26 : మండలంలోని నెల్లుట్ల శ్రీనివాసనగర్ కాలనీ దాసాంజనేయ ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి తాతాచార్యులు (64) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పాలకుర్తి మండలం శాతపురానికి చెందిన తాతాచార్యులు జనగామలోని ఏబీవీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా 20 ఏళ్లు పనిచేశారు. ఆయన పార్థివ దేహానికి కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు చెట్టుపెల్లి నరేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్, ఏబీవీ కళాశాల యాజమాన్యం సంజీవరెడ్డి, నరసింహారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇల్లు ప్రారంభిస్తున్న గంట రవీందర్ తదితరులు

పేద వితంతువుకు చేయూత

కొడకండ్ల, డిసెంబర్ 26 : ఇరవై ఏండ్లకు పైగా గుడిసెలో ఉంటున్న వితంతువు అందె రెబ్బమ్మకు మండలకేంద్రానికి చెందిన ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసన్న పాల్ రేకుల ఇల్లు నిర్మించారు. ఈ మేరకు గురువారం ఇంటిని ప్రారంభించి ఆమెకు అందించారు. ముఖ్యఅతిథులుగా మహాత్మ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్, వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్ వందేమాతరం రవీందర్, ఎస్సై సీహెచ్ రాజు, మై రెడిమర్ స్కూల్ చైర్మన్ పెద్దపూడి జాషువా, నవమణి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్న పాల్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలే తెలిపారు. కార్యాక్రమంలో ధర్మారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రాజు కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

మృతుడికి కుటుంబానికి ఆర్థికసాయం

దేవరుప్పుల, డిసెంబర్ 26 : మండలంలోని లక్ష్మాతండాలో హార్వెస్టర్–ట్రాక్టర్ ఓనర్ బానోత్ రాజు ఈ నెల 24న ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందగా గురువారం స్థానిక హార్వెస్టర్, ట్రాక్టర్ ఓనర్ల యూనియన్ నాయకులు పరామర్శించారు. యూనియన్ తరపున బాధిత కుటుంబానికి రూ.26 వేల ఆర్థికసాయం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు రమేశ్, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు వీరన్న, సభ్యులు యాకన్న, అకిల్, రవి, వీరునాయక్, రవి, జహంగీర్, మహేశ్, వీరన్న, కిషన్, దేవా, సంజీవ, వాసు, జాంబ, రమేశ్, మిట్యా, అశోక్, భద్రు, శ్రీను, రవి, రాంచంద్రు, వెంకన్న, ప్రశాంత్, కుమార్, రవీందర్, పర్శ, నరేశ్, అనిల్, మాల్యా పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం మహాసభలు

మాట్లాడుతున్న మునిగెల రమేశ్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 26 : డివిజన్ కేంద్రంలోని మాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నుంచి రెండు రోజుల సీపీఎం జిల్లా మూడో మహాసభలు నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి మునిగెల రమేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని, ఫ్లైఓవర్ పక్కన గల క్రీడా ప్రాంగణంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కొడెపాక యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి అరెస్టు సరికాదు

తరిగొప్పుల : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం అవివేకమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఐని ప్రశ్నించాడన్న నెపంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుకుందన్నారు. దళిత, గిరిజనులకు అండగా ఉంటున్న శ్రీనివాస్‌పై 12 సెక్షన్ల కేసు నమోదు చేసి, అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమం, అభివృద్ధి పక్కన పెట్టి అరెస్టు, కేసులు, బెదిరింపులే పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి చిలువేరు లింగం, గ్రామ అధ్యక్షుడు అంకం రాజారాం, నాయకులు చెన్నూరి సంజీవ, దామెర ప్రభుదాసు, భుక్యా జూంలాల్‌నాయక్, తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, వంగ రామరాజు, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బూస యాదయ్య, అంకం శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మల్యాల సుధీర్, ఖాతా టోనీ పాల్గొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

బచ్చన్నపేట : తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపాలనలో ఉద్యమ నాయకుడికి ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. కనీసం నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేయడం సరికాదన్నారు. సీమాంధ్రుల పాలన కంటే నీచంగా అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అరెస్టులు ఆపి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

మైదాన గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

కొడకండ్ల, డిసెంబర్ 26 : మైదాన ప్రాంత గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మహేందర్ నాయక్, జిల్లా నాయకులు నర్సింహానాయక్, భూక్యా వెంకట్ నాయక్, భూక్యా సాయి పాల్గొన్నారు.

'కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి'

వెన్నల గద్దర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జే పరశురాములు

జనగామ, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ) : కరెన్సీ నోట్లపై ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత బీఆర్ అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురాం కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నల గద్దర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేరిపోతుల పరశురాం మాట్లాడుతూ అంబేద్కర్ ద్వారానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందన్నారు. ఆర్బీఐ ఏర్పడి 90 ఏళ్లు అయినా కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించకపోవడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. ఆయన వెంట సమితి జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ, బొల్లి స్వామి, గట్టగల్ల సంజీవ పాలొన్నారు.

సీఎం కప్ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

దుస్తుల పంపిణీ అనంతరం క్రీడాకారులతో అధికారులు

జనగామ, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ) : సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం క్రీడా దుస్తులను అందజేశారు. జనగామ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి వాటిని వెంకటనారాయణ గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సభ్యులు మనోజ్ కుమార్, హనుమంతరావు, అశోక్, కుమార్, చందర్, శ్రీనివాస్, రమాదేవి, దిలీప్ కుమార్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రూ. 2,46,700 నగదు స్వాధీనం

ఖిలావరంగల్, డిసెంబర్ 26: కోటలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒకరిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పడమరకోటకు చెందిన తాడెం భరత్(30) ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. విశ్వాసనీయ సమాచారం మేరకు సీఐ ఎం రంజిత్, ఎస్సై దిలీప్ పోలీసు బృందంతో కలిసి అతడి ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో రెండు మొబైళ్లు, రూ. 2,46,700 నగదును స్వాధీనం చేసుకొని విచారణ కోసం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ చెప్పారు.

ఉరేసుకొని దంపతుల ఆత్మహత్య

కుటుంబ కలహాలతో బలవన్మరణం.. అనాథలైన పిల్లలు

గిర్మాజీపేట, డిసెంబర్ 26: కుటుంబ కలహాలతో ఉరేసుకొని దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. ఓని రమేశ్(35), తిరుపతమ్మ(30) దంపతులు తమ పిల్లలు గౌతమ్, గణేశ్‌తో కలిసి లక్ష్మీపురంలో నివాసముంటున్నారు. బుధవారం రాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఇద్దరు పిల్లలు నిద్రించిన తర్వాత రమేశ్, తిరుపతమ్మ ఇంట్లోని సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి అన్న ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. కాగా, గౌతమ్, గణేశ్ రోదనలు మిన్నంటాయి.

బైకును ఢీకొన్న టిప్పర్

మడికొండ, డిసెంబర్ 26 : మడికొండ చౌరస్తాలో గురువారం బైకును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారం గ్రామానికి చెందిన రాజేశ్ రాంపూర్ నుంచి కాజీపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంపూర్ నుంచి మడికొండ మీదుగా ధర్మసాగర్ వెళ్లే టిప్పర్ రాజేశ్ బైకు ఢీకొంది. ఈ ప్రమాదం లో రాజేశ్ కుడికాలు నుజ్జు నుజ్జయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రాజేశ్‌ను 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ఘనంగా సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవం

చిల్పూరు : మండల కేంద్రంలో సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు కుమారస్వామి

చిల్పూరు, డిసెంబర్ 26 : సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ మండల కార్యదర్శి భువనగిరి కుమారస్వామి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ సీపీఐ 99 ఏళ్లు పూర్తి చేసుకుని వందో సంవత్సరంలో అడుగుపెడుతోందన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు కట్ట ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి బంటు పాండు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతంగా సాయుధ పోరాటాన్ని సాగించి, పది లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. నేడు గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, యాదగిరి, శాంతయ్య, బాలరాజు, ఐలయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం'

మాట్లాడుతున్న బోల్లం శారద

జనగామ రూరల్, డిసెంబర్ 26 : ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు స్థానం లేకుండా చర్యలు తీసుకుంటోందని దళిత మహిళా నాయకురాలు బొల్లం శారద అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడంతోనే సీఎం తన సొంత నియోజకవర్గంలోని లగిచర్లలో ఎస్టీల భూములు లాకోవడం, తెలంగాణ ఉద్యమంలో నిరంతరం పోరాటం చేసిన దళిత నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయక పోగా, వాటిపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎస్సీ, ఎస్టీలంతా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

చిల్పూరు,డిసెంబర్ 26 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ లోడెం రజితా రవీందర్ తండ్రి కొండ ఓనయ్య ఇటీవల మృతి చెందగా గురువారం నిర్వహించిన దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గాలి ప్రవీణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

నేడు పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు

హసన్‌పర్తి, డిసెంబర్ 26 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు భీమారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కార్పొరేటర్ జక్కుల రజితావెంకటేశ్వర్లు, పందిళ్ల రమేశ్‌బాబు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సారంగపాణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి, గడ్డం శివరాం ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు 'నేరెళ్ల' స్మారక పురస్కారం ప్రదానం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ 93వ జయంతి సందర్భంగా స్వరార్చన, నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారం ఈ నెల 28న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించనున్నట్లు నేరెళ్ల వేణుమాధవ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శోభావేణుమాధవ్, డాక్టర్ అంపశయ్య నవీన్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ పాల్గొని నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారం మిమిక్రీ శ్రీనివాస్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అమెరికాలో ఐనవోలు మండల వాసి మృతి

స్నేహితుల సహకారంతో స్వగ్రామానికి మృతదేహం

క్రాంతికుమార్‌రెడ్డి(ఫైల్)

ఐనవోలు, డిసెంబర్ 26 : అమెరికాలోని డల్లాస్ నగరంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం గురువారం మండలంలోని స్వగ్రామానికి చేరింది. కాగా, సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగ్గయ్యగూడేనికి చెందిన గొలమారి జోజిరెడ్డి–లూత్‌మెరీ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు క్రాంతికుమార్